క్లుప్తంగా

స్నేహితుల దినోత్సవం



తంగళ్లపల్లి ఫ్రెండ్స్ క్లబ్‌లో వేడుకలు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మిత్రులందరూ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎడమల బాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లింగాల భూపతి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో ఒకరి అదృశ్యం



రాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన లంబ రాములు(50) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. శనివారం ఉదయం ఐదు గంటలకు వ్యవసాయ భూమి వద్దకు పశువులకు గడ్డి వేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన రాములు రాత్రి వరకు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో తెలుసుకున్నా ఆచూకీ లేదు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

బోయినపల్లి: అనారోగ్య సమస్యలతో కొదురుపాక గ్రామానికి చెందిన కుడుదుల కొమురయ్య(70) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఏఎస్సై మోతీరామ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొమురయ్య కొద్ది సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. వీటికి తోడు ఏడాది కింద కాలు విరిగింది. చికిత్స చేయించగా.. స్టాండ్ సాయంతో నడుస్తున్నాడు. భార్య కేతమ్మ తమ మరో ప్లాట్ పరిసరాల్లో గడ్డి తొలగిస్తోంది. భార్య ఇంట్లో లేని సమయంలో కొమురయ్య ఇంటి పరిసరాల్లో చెట్టుకు ఉరేసుకున్నాడు. కొమురయ్యకు ఇద్దరు కొడుకులుండగా.. ఇద్దరూ గతంలోనే మృతిచెందారు. ఇద్దరు కూతుళ్లకు వివాహాలయ్యాయి. కేతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

ఆటోల్లో పరిమితికి మించి తీసుకెళ్లొద్దు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై గణేశ్

ముస్తాబాద్: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని ఎస్సై గణేశ్ అన్నారు. ముస్తాబాద్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోయినపల్లి: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని ఎస్సై దూలం పృథ్వీధర్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, సిబ్బంది కోటి, సాయి ఉన్నారు.

వాహనాల తనిఖీ

తంగళ్లపల్లి: వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు ఎప్పటికప్పుడు చెల్లించాలని తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఒకే వాహనానికి ఏడు చలాన్లున్నట్లు గుర్తించి ఆన్‌లైన్ ద్వారా కట్టించినట్లు తెలిపారు.

నేడు కూరగాయల మార్కెట్ వేలం

ఇల్లంతకుంట: సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో ఇల్లంతకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్, గ్రామ పంచాయతీ షట్టర్లు, వాటర్ ప్లాంట్ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఇల్లంతకుంట గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షట్టర్లకు పాడేవారు రూ.లక్ష డిపాజిట్ చేయాలన్నారు. కూరగాయల మార్కెట్, వాటర్ ప్లాంట్‌కు డిపాజిట్ అవసరం లేదని, ఎవరైనా పాటలో పాల్గొనొచ్చని పేర్కొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర వాల్ పెయింటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా సుంకపాక గంగరాం, అధ్యక్షుడిగా చంద్రగిరి అంజి, ప్రధాన కార్యదర్శిగా బండి శివ, కోశాధికారిగా కందూరి సత్యలింగం, ఉపాధ్యక్షులుగా కడపాల పర్శరాములు, లాల బాబు, కందూరి గణేశ్, రవి, కార్యదర్శులుగా చంద్రలింగం, శ్రీనివాస్, కిరణ్, సహాయ కార్యదర్శిగా రవి, ప్రచార కార్యదర్శిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా హరీశ్, శంకర్, లక్ష్మణ్, రామస్వామి, నగేశ్, ఆనంద్ ఎన్నికయ్యారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడో?

- ప్రమాదాలకు నిలయంగా ముస్తాబాద్–పోతుగల్ రహదారి
- కందకాలు తీసి డివైడర్లు నిర్మించని అధికారులు
- ఏడాదిన్నర కాలంగా రాకపోకలకు ఇబ్బంది
- పనులు పూర్తి చేయాలని డిమాండ్



డివైడర్ల కోసం తీసిన గుంతలు

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్ రహదారి రోడ్డు విస్తరణ పనులకు మోక్షం లభించడం లేదు. ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థ కల్పించేందుకు రోడ్లు భవనాల శాఖ ఏడాదిన్నర క్రితం చేపట్టిన విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా ఎంతోమంది ప్రమాదాలబారిన పడి క్షతగాత్రులవుతున్నారు. ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలం రాళ్లపేట రహదారి విస్తరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

కందకాలు తీసి వదిలేసిన వైనం..

ముస్తాబాద్–రాళ్లపేట మధ్య 21 కిలోమీటర్ల సింగిల్ లైన్ రహదారిని రెండులైన్ల రహదారిగా పనులు చేపట్టేందుకు ఐదేళ్ల క్రితం రోడ్లు భవనాల శాఖ అధికారులు రూ.24 కోట్లు మంజూరు చేశారు. ఏళ్లుగా సాగిన పనుల్లో ముస్తాబాద్, పోతుగల్ గ్రామాల మధ్య నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు ఏడాదిన్నర క్రితం పనులు చేపట్టారు. అయితే ముస్తాబాద్ పట్టణంలో రహదారి వేసిన అధికారులు మానేరు కెనాల్ వరకు రోడ్డు డివైడర్లను నిర్మించేందుకు కందకాలు తీశారు. రెండుపక్కల రోడ్డు వేసి గుంతలు వదిలిపెట్టారు. పనులు పూర్తయిన కందకాల మధ్య డివైడర్ పనులు చేపట్టలేదు. దీంతో తరచూ వాహనదారులు అదుపుతప్పి గుంతలమధ్య పడిపోతూ గాయాలపాలవుతున్నారు. ఆవునూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ డివైడర్ కందకంలో పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. డివైడర్లు నిర్మించకపోయినా, కనీసం గుంతల మధ్య మట్టిని నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నామని, వాహనాలు దెబ్బతింటున్నాయనని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

ముస్తాబాద్, పోతుగల్ మధ్య ఉన్న రహదారిని నాలుగు లైన్లుగా వేశారు. అయితే మానేరు కెనాల్‌పై కొత్త వంతెన నిర్మించకపోవడంతో, పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారు. దీంతో వాహనదారులు ఇరుకు వంతెనపై ఇబ్బంది పడుతున్నారు. ఓబులాపూర్, రాళ్లపేట మధ్య ఒర్రెపై వంతెన పనులు మొదలుపెట్టలేదు. ఇక్కడ సింగిల్‌లైన్ రహదారి ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. పోతుగల్, గన్నెవారిపల్లె మధ్య గంగమ్మ వాగుపై వంతెన పనులు కొనసాగుతున్నాయి. మరో ఒర్రెపై ఉన్న పాత వంతెన శిథిలావస్థకు చేరుకుంది. భారీ వరదలు వచ్చినప్పుడు ముస్తాబాద్, సిరిసిల్ల మధ్యన రాకపోకలు నిలిచిపోతాయి. అసంపూర్తి పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



ముస్తాబాద్, పోతుగల్ మధ్య నాలుగు లైన్ల రహదారి కోసం డివైడర్లకు స్థలం వదిలి పెట్టారు. ఏడాదిగా డివైడర్లు నిర్మించకపోవడంతో కందకంలో పడి గాయాలపాలవుతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మానేరు కెనాల్‌పై కొత్త వంతెన నిర్మించాలి.

– పర్వతం రాజు, ముస్తాబాద్

రాకపోకలకు ఇబ్బంది



రహదారిపై ఉన్న డివైడర్ల గుంతలను తక్షణమే మట్టితో నింపాలి. లేదా డివైడర్లైనా నిర్మించాలి. ఏడాదిగా నిర్మించకుండా వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న రహదారితో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

– మల్లారపు సంతోష్‌రెడ్డి, ముస్తాబాద్

సీసీ రోడ్డు వేయిస్తాం



ముస్తాబాద్, పోతుగల్ మధ్య డివైడర్ల కోసం వదిలేసిన స్థలంలో సీసీ రోడ్డు వేయిస్తాం. గతంలో డివైడర్లు నిర్మించి, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలనుకున్నాం.కొన్ని కారణాల వల్ల పనులు పూర్తికాలేదు. త్వరలోనే డివైడర్ల స్థలంలో సీసీ వేయించి ప్రమాదాలు నివారిస్తాం.

– నాగరాజు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం



ముస్తాబాద్: మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు

ముస్తాబాద్: ఎస్సీ వర్గీకరణతో మాదిగలు, ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సెస్ మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య అన్నారు. గూడెం అంబేడ్కర్ భవనంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. నాయకులు బట్టు రాజయ్య, మండెపల్లి రాములు, ఎల్లయ్య, సడిమెల బాలయ్య, రాజయ్య, శంకర్, అశోక్, కిషన్, కృష్ణ, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా నాయకుడు కానాపురం లక్ష్మణ్, మండల నాయకులు ఎర్రొల్ల శంకర్, ఇరిగి సందీప్, బరుకుంట తిరుపతి, ఇరిగి పర్శరాములు, నరేశ్, శ్రీహరి, భాను, భిక్షపతి, బాలకిషన్, మహేశ్, దేవయ్య, బాబు, సంతోష్, జీవన్, బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు నెరవేరాయి

- ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ భిక్షపతి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటంలో అమరులైన ఆశయాలు సుప్రీంకోర్టు తీర్పుతో నెరవేరాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి పేర్కొన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఇచ్చిన మాటను ప్రధాని నరేంద్రమోదీ నిలబెట్టుకున్నారన్నారు. ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, నాయకులు దాసరి కృష్ణంరాజు, పోతుల రాజు, తాళ్లపెల్లి రాములు, తాళ్లపెల్లి నర్సయ్య, ప్రశాంత్, శంకరయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత



పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి

ఇల్లంతకుంట: వెల్జిపురం, ముస్కాన్‌పేట, కేసన్నపల్లెలో మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులను ఆదివారం బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భేంద్రం తిరుపతిరెడ్డి పరామర్శించారు. వెల్జిపురం గ్రామంలో సోనావేని పరశురాం మరణించగా వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం, ముస్కాన్‌పేట గ్రామంలో దాసరి నరసయ్య మరణించగా వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. కేసన్నపల్లెకు చెందిన వడిజ నరసింహారావు గుండెనొప్పితో మరణించగా పరామర్శించారు. సభ్యులున్నారు.

నేడు హెల్త్ సెంటర్ ప్రారంభం

వేములవాడరూరల్: మల్లారం గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించనున్నారు. కాంగ్రెస్ నాయకులు హాజరు కానున్నారు.

కిక్ బాక్సింగ్ సెమినార్‌లో శ్రీనివాస్



ప్రశంసాపత్రం అందుకుంటున్న మాస్టర్ శ్రీనివాస్

సిరిసిల్లకల్చరల్: జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ సెమినార్‌లో సిరిసిల్లకు చెందిన కరాటే మాస్టర్ వడ్నాల శ్రీనివాస్ పాల్గొని ప్రశంసాపత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని తైక మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెఫరీ టెక్నికల్ సెమినార్‌కు హాజరయ్యారు. జిల్లా నుంచి సీనియర్ మాస్టర్ శ్రీనివాస్, కోచ్ ఎలగందుల శ్రీనివాస్, మాస్టర్ గగ్గూరి దివ్య, లత పాల్గొన్నారు.

వేములవాడ: హైదరాబాద్‌లోని మియాపూర్‌లో తైక మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి రిఫరీ టెక్నికల్ సెమినార్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ట్రెసిడర్ కరాటే మాస్టర్ దివ్య, పిట్టల లత పాల్గొని అత్యంత ప్రతిభ చూపించి ప్రశంసా పత్రాలను పొందారు. తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, జనరల్ సెక్రటరీ మహిపాల్ చేతుల మీదుగా రెఫ్రీ పత్రం అందుకున్నారు.

పెద్ద రథం శుభ్రం చేసిన ఆలయ కమిటీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ పెద్ద రథంపై దుమ్ము, ధూళి ఉండగా.. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు శుభ్రం చేశారు. కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ మాట్లాడుతూ.. ఆలయ పునర్ నిర్మాణ పనులు జరిగేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. వెంకటేశ్‌గౌడ్, బాల్‌రాజ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చేయూత



వీర్నపల్లి: గర్జన్‌పల్లి గ్రామానికి చెందిన నయనశ్రీ 15 రోజుల నుంచి అనారోగ్యంతో పాఠశాలకు వెళ్లడం లేదు. తన తోటి విద్యార్థిని ఎందుకు రావడం లేదని తనతండ్రి బుచ్చగారి రాకేశ్‌గౌడ్‌ను శ్రావణి అడిగింది. సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనం చూసి జిల్లా కలెక్టర్ రూ.10లక్షలు ఆర్థిక సాయం చేశారని చెప్పడంతో.. మనం కూడా ఎంతో కొంత సాయం చేద్దామని కోరింది. స్పందించిన రాకేశ్ స్నేహితుల దినోత్సవం సందర్భంగా రూ.2,500 చిన్నారి ద్వారా నయనశ్రీకి అందజేశారు.

కరాటే బెల్టులు, ధ్రువపత్రాలు అందజేత

సిరిసిల్ల అర్బన్: పట్టణంలో డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడ్ టెస్ట్ ఆదివారం నిర్వహించామని సంస్థ ఇన్‌చార్జి, సీనియర్ కరాటే మాస్టర్ మామిడాల సమ్మయ్య తెలిపారు. కటా, స్పారింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు దొంతుల శ్రీనిఖ, సాహితి, ముదారి శ్రీనిధి, ముదారి స్ఫూర్తి, ఎ.ఉదంతికకు సమ్మయ్య, డైరెక్టర్ కుమ్మరి మల్లేశం చేతులమీదుగా ఎల్లో బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



మండెపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండెపల్లి గ్రామంలో ఆదివారం 17 మంది లబ్ధిదారులకు రూ.2.67లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మొండయ్యకు రూ.45వేలు, ఎల్లయ్యకు రూ.30వేలు, సంజీవ్‌కు రూ.24వేలు, రాణికి రూ.21వేలు, మాలతికి రూ.18వేలు, పద్మకి రూ.18వేలు, వనజకి రూ.13వేల చొప్పున చెక్కులు అందజేశారు. మాజీ సర్పంచ్ గణప శివజ్యోతి, సిరిసిల్ల సింగిల్విండో చైర్మన్ బండి దేవదాస్, మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న, నాయకులు బుస్స లింగం, రాగిపెల్లి కిష్టారెడ్డి, పసుల శేఖర్, పెద్ది రఘు, పన్యాల దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా మారిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. రాచర్లబొప్పాపూర్, సింగారం, దేవునిగుట్టతండా, బొంగులకింది తండా, బండలింగంపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం నాయకులు పంపిణీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, నాయకులు లింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి, ఏలూరి రాజయ్య, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



భగీరథ గుంతలతో పైలం

ముస్తాబాద్: మిషన్ భగీరథ అధికారులు పైపులైన్ల విచారణ కోసం చేపట్టిన గుంతల తవ్వకాలు ప్రమాదకరంగా మారాయి. మండలంలో మిషన్ భగీరథ పైపులైన్ ఎక్కడ వేశారో తెలుసుకునేందుకు గుంతలను తీసి పరీక్షించారు. పైపులైన్ల వద్ద తీసిన గుంతలను అలాగే వదిలేశారు. దీంతో రోడ్డు పక్కన గుంతలు ప్రమాదకరంగా మారాయి. రహదారి వెంట వెళ్లేవారికి గుంతలతో ప్రమాదం పొంచి వుంది.

గంజివాగు కల్వర్టు పనులు పూర్తి చేయాలి



గంజివాగు కల్వర్టు వద్ద బీజేపీ నాయకులు

బోయినపల్లి: స్తంభంపల్లి గ్రామ పరిసరాల్లో నిర్మిస్తున్న గంజివాగు కల్వర్టు పనులు త్వరగా పూర్తయ్యేలా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల నాయకులతో కలిసి ఆదివారం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఉదారి నర్సింహాచారి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి. మెరుపుల గంగాధర్, రాజూరి కిరణ్, బోగోజి గంగాధర్ చారి, బొంగాని అశోక్ తదితరులున్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసిన నాయకులు

చందుర్తి: ఆటల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈర్లపెల్లి రాజు అన్నారు. మూడపల్లి గ్రామంలో నెల రోజులుగా కొనసాగుతున్న సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి రాజు, చందుర్తి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ ఆదివారం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హరీశ్ లెవల్ జట్టు విజేతగా నిలవగా.. రూ.20వేల నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు. రన్నర్ చిరు లెవల్ జట్టుకు రూ.10వేల నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: యోగాతో మానసిక ప్రశాంతతతోపాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. ఆదివారం సిరిసిల్లలో తపోవన కేంద్రం ఆధ్వర్యంలో భారతదేశ ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు, పతంజలి విద్యాపీఠం అధిపతి ఆచార్య బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పతంజలి యోగా సమితి కన్వీనర్ ఎలిగేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థికి సన్మానం



బోయినపల్లి: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేటలో 4వతరగతి ప్రవేశానికి ఎంపికైన మండల కేంద్రానికి చెందిన మొగులోజి మానస–గంగాచారి దంపతుల కూతురు లిఖితను ఆదివారం సాయంత్రం మండల విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు ఉదారి నర్సింహాచారి, జగదీశ్వరాచారి, బోగోజి గంగాధర్‌చారి, భూమయ్య, ప్రసాద్, శేఖర్, లక్ష్మీనారాయణ, లక్ష్మీరాజం, లచ్చయ్య, సత్తయ్య, రమేశ్ తదితరులున్నారు.

ఏషియన్ క్రిమినాలాజికల్ కాన్ఫరెన్స్‌కు మహేశ్‌గౌడ్



సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ న్యాయవాది చెక్కిళ్ల మహేశ్‌గౌడ్ 15వ ఏషియన్ క్రిమినాలాజికల్ కాన్ఫరెన్స్‌కు ఎంపికయ్యారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఏషియన్ క్రిమినాలాజికల్ సొసైటీ(ఏసీఎస్), ప్రొఫెషనల్ క్రిమినాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సుకు హాజరవుతున్నారు. ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించే ఈ సదస్సులో క్రిమినాలజీ క్రిమినల్ జస్టిస్, టెక్నాలజీ అండ్ పబ్లిక్ సేఫ్టీ అనే అంశంపై మాట్లాడనున్నారు. ఫోరెన్సిక్ సైన్స్ అండ్ ది రూల్ ఆన్ ఎవిడెన్స్ అనే అంశంపై మహేశ్‌గౌడ్ రాసిన అంశం వార్షిక జర్నల్‌లోనూ ప్రచురణకు ఎంపికైంది.

వస్త్ర పరిశ్రమ సమస్యను పరిష్కరించాలి

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను సిరిసిల్ల పవర్‌లూమ్ యజమానులు, అసాములు ఆదివారం కలిశారు. వస్త్ర పరిశ్రమ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం అమావాస్య కావడంతో భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే కొనసాగింది. రాజన్న వసతి గదుల సమాచారం ఇలా ఉంది.

కాంప్లెక్స్ పేరు	మొత్తం	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	08	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	56	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	04	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	05	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	55	1,008
నందీశ్వర్ నాన్‌ఏసీ	112	560
నందీశ్వర సూట్స్	08	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	94	448
పార్వతీపురం స్పెషల్	56	672
పార్వతీపురం సాధారణ	54	336

– వేములవాడ



గంభీరావుపేట మండల కేంద్రం నుంచి మా ఊరు నర్మాల గ్రామానికి వెళ్లే రోడ్డుకిరువైపులా చెట్ల పొదలు ఏపుగా, దట్టంగా పెరిగాయి. ఎదురెదురుగా వచ్చేవారు కనబడనంతగా చెట్ల పొదలు పెరిగిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించాలి.

– రాజబోయిన ఆంజనేయులు, నర్మాల, గంభీరావుపేట మండలం

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440243048